క్లుప్తంగా

ఏషియన్ హ్యాండ్‌బాల్‌లో జిల్లా క్రీడాకారుడికి పతకం



మహబూబ్‌నగర్ క్రీడలు: ఉజ్బెకిస్తాన్‌లో ఈనెల 14 నుంచి 21 వరకు జరిగే సెంట్రల్ ఏషియన్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన బి.బాల్‌రాజు పాల్గొన్నాడు. ఈ టోర్నీలో ఇండియా పురుషుల జట్టుకు ప్రాతినిధ్యం వహించిన బాల్‌రాజు కాంస్య పతకం సాధించాడు. కాగా బాల్‌రాజును శుక్రవారం హైదరాబాద్‌లో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జగన్ మోహన్‌రావు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎండి.జియావుద్దీన్, ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహ స్వామి రథోత్సవం



మాగనూర్: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం కనుల పండువగా కొనసాగింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకిలో బాజాభజంత్రీల మధ్య స్వామివారి విగ్రహం ముందుకు కదిలింది. మహారాష్ట్ర, కర్ణాటక, హైదారబాద్ లాంటి ప్రాంతాల నుంచి వేలాదిగా స్వామివారి దర్శనంకోసం భక్తులు తరలివచ్చారు. పలు పార్టీల నాయకులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పాల ఉట్ల ఉత్సవం..



సాయంత్రం పాల ఉట్ల ఉత్సవాన్ని నిర్వహించారు. 25మందికి పైగా యువకులు పాల ఉట్ల స్తంభాన్ని ఎక్కేందుకు పోటీ పడ్డారు. అయితే ఈ సారి గ్రామపెద్దలు ముందుగా కొంతసేపు చిన్నారులను పాల ఉట్లు ఎక్కించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాజు, జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, మాజీ ఉపసర్పంచ్ సుధా, ఆలయ కమిటీ సభ్యులు వాకిటి వాబయ్య, బలరాజు, నరేష్, వాకిటి శ్రీనివాసులు, కృష్ణయ్య, సత్యప్ప, ఆనంద్, గ్రామ పెద్దలు, ఆనంద్‌గౌడ్, వెంకటయ్య, చెన్నప్ప, ఉజ్జెల్లి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన పాఠశాల కూల్చివేత

మరికల్: మండల కేంద్రంలోని శిథిలావస్థకు చేరిన జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలను శుక్రవారం కలెక్టర్ ఆదేశాలతో అధికారులు కూల్చివేయించారు. 70ఏళ్ల పాటు ఎంతోమంది విద్యార్థులకు విద్యను అందించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉండటంతో ముందస్తుగా విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరకముందే కూల్చివేత చర్యలు చేపట్టారు. మనఊరు –మన బడి కింద పాతభవనం ఎదుట కొత్త భవనం నిర్మించారు. ఆ భవనాన్ని ప్రారంభించాల్సి ఉంది.

వ్యక్తిపై కేసునమోదు

మహమ్మదాబాద్: పొలానికి రక్షణగా వేసిన కంచె రాతికడీలను విరగొట్టిన వ్యక్తిపై కేసునమోదు చేసిన ఘటన మండలపరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెల్పిన కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని చెన్నకేశవులు పొలంలో కంచె ఏర్పాటు చేశాడు. కాగా ఎలాంటి కారణం లేకుండా శ్రీను, ఉదయ్‌కుమార్ అనే ఇద్దరు వ్యక్తులు పొలంలోకి ప్రవేశించి కడీలను విరగొట్టి ధ్వంసం చేశారు. కాగా పొలం యజమాని ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

మహమ్మదాబాద్: మండల పరిధిలోని జూలపల్లి గ్రామానికి చెందిన కటికె రవీందర్ (55) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ రామ్మోహన్‌రెడ్డి గ్రామానికి వచ్చారు. బాధితకుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆర్థికసాయం అందించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనారోగ్యంతో ఉన్నప్పుడు తన మెడికల్ ఆస్పత్రిలో ఉచిత వైద్యం చేయించినట్లు గుర్తుచేశారు. అయినా పూర్తిగా కోలుకోకుండా చిన్న వయసులోనే మృతిచెందడం ఎంతో దురదృష్టకరమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, కార్యకర్తలు ఉన్నారు.

ఇబ్బందులు తప్పవా?



తిరుమలగిరి గ్రామం

- రెవెన్యూ పరంగా ఒక మండలంలో..
- రక్షణవ్యవస్థ పరంగా మరో మండలంలో..
- అవస్థలు పడుతున్న వివిధ గ్రామాల ప్రజలు



పంచాయతీ కార్యాలయం

రాజాపూర్: రాష్ట్రం ఏర్పాటు అయ్యాక 2016లో పరిపాలన సౌలభ్యం కోసం అప్పటి ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా బాలానగర్ మండలంలోని రాజాపూర్ గ్రామాన్ని 24 గ్రామపంచాయతీలతో కొత్త మండలంగా ఏర్పాటు చేశారు. అయితే తిరుమలగిరి, మొదంపల్లి, చిన్నరేవల్లి, పోషమ్మగడ్డ తండా పంచాయతీలను రెవెన్యూ పరంగా బాలానగర్ మండలంలోనే ఉంచారు. కానీ పోలీసు వ్యవస్థ పరంగా వీటిని రాజాపూర్ మండలంలో కొసాగిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెవెన్యూ పరమైన విషయాల్లో బాలానగర్ మండలానికి.. శాంతి భద్రతల సమస్యల విషయంలో రాజాపూర్ మండలానికి వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. అదేవిధంగా ఈ గ్రామాల ప్రజలు తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయశాఖ, విద్యుత్‌శాఖ తదితర పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వెళ్లాలంటే.. దాదాపు 12 కిలోమీటర్లు ప్రయాణం చేసి బాలానగర్ వెళ్లాల్సివస్తోంది. అదేక్రమంలో ఇటు పోలీసు స్టేషన్‌కు వెళ్లాలంటే అదనంగా మరో 8 కిలోమీటర్లు ప్రయాణం చేసి రాజాపూర్‌నకు వెళ్లాల్సివస్తోంది. అంతేకాకుండా బాలానగర్‌కు కిలోమీటర్ దూరంలోనే ఉన్న పెద్దాయపల్లి, శేరిగూడ, చింతకుంటతండా, ఉడిత్యాల గ్రామాలకు వైద్యపరమైన సేవలు అందించాలన్నా.. రాజాపూర్ పీహెచ్‌సీ నుంచి సిబ్బంది వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఆయా గ్రామాల్లో గర్భిణులకు, చిన్నపిల్లలకు, వృద్ధులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్యం అందించడంలో ఇబ్బందులు తప్పడం లేదు. సిబ్బంది సైతం రాజాపూర్ నుంచి అక్కడి వరకు వెళ్లాలంటే అవస్థలు పడాల్సిన పరిస్థితి తలెత్తుతుతోంది. ఈక్రమంలోనే ఆయా గ్రామాల ప్రజలు అన్నిసౌకర్యాలు ఒకే మండల పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే తమ గ్రామాలను బాలానగర్ మండలంలో చేర్చాలని నాటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి, అధికారులకు విన్నవించారు. అయినా ఫలితం దక్కలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అయినా ప్రత్యేక చొరవ తీసుకుని తమ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామపంచాయతీలను బాలానగర్ మండలంలోనే కొనసాగించాలని అప్పట్లో నాటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ఎన్నోపర్యాయాలు విన్నవించాం. కానీ ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ప్రస్తుత కొత్త ప్రభుత్వం అయినా మాగ్రామాలను బాలానగర్ మండలంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి. అక్కడ అయితేనే మాకు అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుంది.

– బత్తుల శ్రీనివాస్‌గౌడ్, చిన్నరేవల్లి

ధ్రువప్రతాల కోసం రెండుచోట్లకు..



మా గ్రామస్తులు ఏదైనా ధ్రువపత్రం పొందాల్సి వస్తే తప్పనిసరిగా రెండు మండలాలకు వెళ్లాల్సివస్తోంది. తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, ఎంపీడీఓ, అగ్రికల్చర్ ఇలా అన్ని ఒకే మండలంలో ఉంటే బాగుంటుంది. మా గ్రాపంచాయతీ బాలానగర్ మండలంలోనే ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కేస్లీ, మాజీసర్పంచ్, తిరుమలగిరి

బుద్ధారంలో బుద్ధజయంతి

హన్వాడ: మండల పరిధిలోని బుద్ధారం గ్రామంలో శుక్రవారం బుద్ధ జయంతి ఘనంగా నిర్వహించారు. బుద్ధ ఆరామ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి థాయ్‌లాండ్‌కు చెందిన బాతేజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కమిటీ అధ్యక్షుడు బాలకిష్టయ్య, వెంకటయ్య, నాగప్ప పాల్గొన్నారు.

హైస్కూల్‌లో పరిస్థితులపై ఆరా

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని బాదేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ సందర్శించారు. హైస్కూల్‌లో పరిస్థితులపై ఆయన ఆరాతీశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో మొదటి విడతలోనే ఎంపికయినప్పటికీ పనులు ప్రారంభం కాలేదని హెచ్ఎం చంద్రకళ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రహరీ నిర్మాణం చేపట్టాల్సి ఉందని, దానికి ఇంకా ప్రతిపాదనలు సిద్ధం చేయలేదని ఆయనకు తెలియజేశారు. కాగా స్పందించిన ఆయన త్వరితగతిన ప్రతిపాదనలు చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలో కొనసాగుతున్న విద్యుత్ వైరింగ్‌పనులు పరిశీలించారు. ఆవరణలో ఎండిన మొక్కలు తొలగించి మళ్లీ మొక్కలు నాటించాలని సూచించారు. ఆయన సందర్శనలో ఉపాధ్యాయులు గోవింద్‌నాయక్, ఇబ్రహీం, రఘులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలులో జాప్యం తగదు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి బాబురావు

బాలానగర్: ధాన్యం కొనుగోలులో ఎలాంటి జాప్యం చేయరాదని మండల ప్రత్యేక అధికారి బాబురావ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఉడిత్యాలలో పీఏసీఎస్ (సింగిల్ విండో) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సమయంలో రైతులు తెచ్చిన ధాన్యం కొనుగోలులో ముందస్తుగా వారు పాటించాల్సిన నియమాలను తెలియపరిచి.. ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని విద్యార్థులకు అందించబోవు పాఠశాల ఏకరూప కుట్టు దుస్తులను ఆయన పరిశీలించారు. ఏపీఎం నాగరాజు తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు

రాజాపూర్: రైతులు విత్తనాలు కొనేముందు దుకాణాదారు నుంచి కచ్చితంగా రసీదు తీసుకోవాలని ఏఈఓ దీపికాగౌడ్ సూచించారు. శుక్రవారం రాజాపూర్ మండలంలోని ఖానాపూర్, సింగమ్మగూడతండాల్లో రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. గ్రామంలోగానీ, మీ మండలంలోగానీ లైసెన్స్ కలిగిన డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దన్నారు. అదేవిధంగా ఎవరైనా విత్తనాలను ప్యాకెట్‌పై నిర్ధారించిన రేటు కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. పాకెట్‌పై విత్తనం తయారు చేసిన తేదీ తదితరాలను సరిచూసుకున్నాకే కొనాలన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏఈఓ దీపికాగౌడ్

కార్యక్రమంలో రైతులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సేవ్యానాయక్, కేస్లీ, మంగ్లీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో అభివృద్ధి పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 26వ వార్డు పరిధిలోని హబీబ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం వార్డు నం.2 పరిధిలోని బృందావన్‌కాలనీలో నర్సరీని తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ ఈఈ బెంజిమన్, ఏఈలు సాయిరాం, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు ఎద్దు మృతి

చిన్నచింతకుంట: మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీవర్షం కురిసింది. ఈ క్రమంలో అమ్మపురంలో శివకుమార్ వ్యవసాయ పొలంలో పిడుగు పడింది. ఘటనలో అతడి ఎద్దు మృతి చెందింది. దీంతో రూ.70వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ఘనంగా భూలక్ష్మీదేవి బోనాలు



బోనాల వేడుకలో పాల్గొన్న మహిళలు

నవాబుపేట: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఘనంగా భూలక్ష్మీదేవి బోనాల వేడుక నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వేడుక జరిగింది. అమ్మవారికి ప్రత్యేకపూజలు చేసిన అనంతరం మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రంగారావు, సుధాకర్‌చారీ, దుబాయి నర్సింహులు, రవి, రఘు, శశికుమార్, అశోక్, అంజయ్య, నిరంజన్, వెంకటయ్య, సత్యం, దడవాయి కార్మిక సంఘం, హమాలి, చాట కార్మిక సంఘాలు, మహిళలు పాల్గొన్నారు.

వ్యాధుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి

మిడ్జిల్: మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం సమీపంలోని కాలనీల్లో గత వారం రోజుల నుంచి ప్రజలు చికెన్ గున్యా, మలేరియాతో బాధ పడుతుండడంతో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సదరు శిబిరాన్ని శుక్రవారం జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ పరిశీలించారు. కాలనీల్లో ఇంటింటికి తిరిగి వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జ్వరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయన వెంట రాజు, ఎంపీడీఓ గీతాంజలి, ఈఓపీఆర్‌డీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.



మిడ్జిల్‌లో పర్యటిస్తున్న అధికారులు

కార్మికుల ఉపాధి కోసం ఉద్యమాలకు సిద్ధం



మాట్లాడుతున్న వెంకటేష్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కార్మికుల ఉపాధి కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని రైస్, ఆయిల్ మిల్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఇఫ్ట్యూ కార్యాలయంలో రైస్, ఆయిల్ మిల్లులలో పనిచేస్తున్న దినసరి మహిళా కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా కూలీలు రోజువారీగా బట్టీపైన వందలాది బస్తాలు గుమ్మరిస్తున్న క్రమంలో వచ్చే దుమ్ముతో టీబీ, గర్భసంచి వ్యాధుల లాంటి దీర్ఘకాలిక రోగాలకు గురవుతున్నారని వాపోయారు. వీరికి ఉపాధి భద్రతతో కూడిన సమగ్ర చట్టం రూపొందించాలని, వృద్ధాప్య పింఛన్ రూ.ఆరు వేలకు తగ్గకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరణించిన బాధిత కుటుంబాలకు రూ.పది లక్షల బీమా కల్పించాలన్నారు. రైస్, ఆయిల్ మిల్లులు ప్రధానంగా వ్యవసాయ రంగంపై ఆధారపడ్డాయన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు.

కుదిరిన వేతన ఒప్పందం

అనంతరం కూలీలకు దినసరి వేతనం రూ.490 నుంచి రూ.580కి పెంచడానికి, ఈఎస్ఐ సౌకర్యం కల్పించేందుకు రైస్, ఆయిల్ మిల్లుల యజమానుల ప్రతినిధులు, ఇఫ్ట్యూ కార్మికసంఘ ప్రతినిధుల మధ్య ఒప్పందం కుదిరింది. ఇది ఈనెల 1 నుంచి అమలవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు పి.దాసు నాయకులు ఎం.నర్సింహులు, పి.చెన్నయ్య, నాయకురాళ్లు చంద్రమ్మ, సరోజ, మణెమ్మ, నాజీయాబేగం, చంద్రకళ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రవీందర్

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం మళయాళ స్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమంలో వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ కల్చరల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిబిరం శుక్రవారం ముగిసింది. గత నెల 25న ప్రారంభమైన వేసవి ప్రత్యేక శిబిరంలో 10 ఏళ్ల నుంచి 15ఏళ్ల వరకు వయసు ఉన్న 250మంది బాల బాలికలు పాల్గొన్నారు. వీరిలో 130 మంది బాలికలు, 120మంది బాలురు పాల్గొన్నారు. 30రోజుల పాటు నిర్వహించిన శిబిరంలో జడ్చర్ల, మిడ్జిల్, ఊర్కొండ మండలాలతోపాటు వనపర్తి, దేవరకద్ర, మహబూబ్‌నగర్ వంటి ఇతర ప్రాంతాలనుంచి సైతం హాజరయ్యారు. కాగా బాలబాలికలకు సాంస్కృతిక, ఎడ్యుకేషనల్ రెండు భాగాల్లో శిక్షణ ఇచ్చారు. సాంస్కృతిక విభాగంలో కూచిపూడి, భరతనాట్యం, జానపదగేయాలు, యోగ, కరాటే వంటి వాటిలో నిష్ణాతులతో తర్ఫీదునిచ్చారు. ఎడ్యుకేషనల్ విభాగంలో ఆంగ్లంపై పట్టు, మ్యాథ్స్‌లో ప్రావీణ్యం కల్పించారు. వీటితోపాటు నైతిక విలువలపై పలువురు ప్రముఖులతో సందేశాలు ఇప్పించారు. చదువు సంస్కారం రెండింటితోపాటు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణపై బాలబాలికలకు తగిన విధంగా అవగాహన కల్పించారు. శుక్రవారం ముగింపు వేడుకల్లో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మాధవరెడ్డి పాల్గొని సందేశాన్ని ఇచ్చారు. రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, శిబిరం ఇన్‌చార్జ్ శ్రీను, శృతిలయ కల్చరల్ అకాడమీ డైరెక్టర్ చిత్తరంజన్‌దాస్‌లతోపాటు మళయాళ స్వామి ఆశ్రమం ప్రతినిధి, వాలంటీర్లు పాల్గొన్నారు. కాగా శిబిరం ముగింపు పురస్కరించుకుని ఆశ్రమంలో నిర్వహించిన తల్లిదండ్రుల పాదపూజ భావోద్వేగ వాతావరణం ఏర్పరచింది. పిల్లలు తమ తల్లిదండ్రుల విలువలు తెలుసుకుని వారిని హత్తుకోవటం.. తల్లిదండ్రులు సమయం ఇవ్వకపోవటం వంటి చిన్న చిన్న పొరపాట్లు గుర్తించి వారిని దగ్గరకు తీసుకోవటం లాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇలాంటి శిబిరాలు మరిన్ని నిర్వహిస్తే బాగుంటుందని తల్లిదండ్రులు, ఆహుతులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

జీలుగ విత్తనాలు పంపిణీ

దామరగిద్ద: ప్రభుత్వం తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ద్వారా ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను సరఫరా చేసిన జీలుగ విత్తనాలను రైతులకు అందజేస్తున్నారు. 30 కేజీల బస్తా రూ. 1116 లకు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు. రెండు రోజులగా ఆగ్రోస్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని అవసరమైన రైతులు తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అజయ్‌కుమార్, రైతులు, డీలర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల వితరణ

మాగనూర్: మండల పరిధిలోని అడవిసత్యారంలో కీశే. మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి జ్ఞాపకార్థం వారి మనుమరాలు యశస్వి జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రామంలోని పేద విద్యార్థులకు పాఠశాల బ్యాగులు వితరణ చేశారు. ఈ మేరకు.. కాంగ్రెస్ నాయకులు శివరాంరెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు తమవంతుగా సాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



గండేడ్‌లో చిరుత కలకలం

- కొండాపూర్‌లో లేగదూడ మృతి
- లింగాయిపల్లి వద్ద రోడ్డు దాటిన చిరుత
- లారీకి అడ్డుగా వచ్చిన వైనం
- ఆందోళనలో గ్రామస్తులు

గండేడ్: మండలంలో చిరుత సంచారంతో కలకలం సృష్టించింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన వెన్నాచేడ్ శ్రీనివాస్ తన పొలం ఆశిరెడ్డిపల్లి గుట్టవైపు ఉంది. రోజువారీగానే గురువారం సాయంత్రం శ్రీనివాస్ తన పశువులను పాక వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. ఉదయం యథావిధిగా ఐదు గంటల ప్రాంతంలో పొలానికి వెళ్లాడు. ఆసమయంలో తమకు చెందిన ఓ లేగదూడ కనిపించలేదు. దీంతో ఆయన సమీపంలో ఉన్నవారితో కలిసి చుట్టుపక్కల వెతికాడు. చివరికి గుట్ట సమీపంలో గుండ్లలో వారికి లేగదూడ మృతదేహం కనిపించింది. ఈ క్రమంలోనే కొద్దిదూరంలో వారు చిరుత పడుకుని ఉన్నట్లు గుర్తించి భయాందోళన వెనక్కి తిరిగి వచ్చేశారు. కాగా సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో వర్షం పడింది. ఆసమయంలో గుండ్లలోనుంచి దిగిన చిరుత ఆశిరెడ్డిపల్లి వైపు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఇదిలా ఉండగా రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో మండల పరిధిలోని లింగాయిపల్లి వద్ద చిరుత రోడ్డు దాటినట్లు స్థానికులు చెపుతున్నారు. కాగా లింగాయిపల్లి గేటు సమీపంలో వరి కొనుగోలు కేంద్రం ఉంది. వడ్లు లోడు చేసుకుని వెళుతుండగా ఏదుల వారి మైసమ్మ వద్ద చిరుత రోడ్డు దాటినట్లు లారీ డ్రైవర్ స్థానికులకు తెలిపారు. ఈవిషయం తెలుసుకున్న స్థానికులు భయాందళోనకు గురవుతున్నారు. అటవీ అధికారులు జోక్యం చేసుకుని చిరుతను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉచిత శిక్షణ

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో నిరుద్యోగ యువతీ, యువకులకు వారియర్స్ డిఫెన్స్ అకాడమి ఉచితంగా అగ్నివీర్ ఎంపికకు శిక్షణ ఇస్తుందని డైరెక్టర్ ఆంజనేయులు తెలిపారు. 2024 ఏడాదికి గాను నోటిఫికేషన్ విడుదల కావడంతో జనవరి నుంచి ఉచితంగా మెటీరియల్ ఇవ్వడంతోపాటు థియరీ క్లాసులు నిర్వహించారు. శుక్రవారం నుంచి ఫిజికల్ టెస్టుల శిక్షణను ప్రారంభించారు. అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు.



ఫీడర్ చానల్స్‌పై దృష్టి సారించండి



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నర్సింహులు

గండేడ్: గ్రామాల్లో ఫిష్‌పాండ్, ఫారం పాండ్, ఫీడర్ చానల్స్ తదితర వాటిపై దృష్టి సారించాలని డీఆర్‌డీఓ నర్సింహులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెన్నాచేడ్‌లో ఉపాధి పనులు, వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి పనులకు వచ్చే కూలీలతో మాట్లాడారు. 'రోజు ఎన్ని గంటలు పని చేస్తున్నారు. ఎంత మట్టి తీస్తున్నారు. ఎన్ని ట్రాక్టర్లలో తరలిస్తున్నారు' అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. డబ్బులు వస్తున్నాయా? లేదా వస్తే ఎన్ని రోజులకు వస్తున్నాయని అడిగారు. కాగా పలువురు కూలీలు తమకు గిట్టుబాటు అవ్వడం లేదని కనీసం రూ. నూటయాభై కూడా పడడం లేదని తెలిపారు. ఇదిలా ఉండగా హరితహారంలో మొక్కలు నాటేందుకు గాను గుంతలు తవ్వాలని డీఆర్‌డీఓ సూచించారు. నాలుగైదు గుంతలు రెండు గంటల్లో తవ్వవచ్చాన్నారు. దీని ద్వారా కూలీలకు గిట్టుబాటు అవుతుందన్నారు. అనంతరం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతమంది రైతుల ధాన్యాన్ని కొనగోలు చేశారని ఐకేపీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 260 మంది రైతుల ద్వారా ధాన్యాన్ని సేకరించామని నిర్వాహకులు తెలిపారు. కాగా డబ్బులు రావడంలో ఏమైనా ఆలస్యం జరుగుతుందా అని డీఆర్‌డీఓ ప్రశ్నించారు. తేమ విషయంపై ఆరా తీయగా ఒక లారీలో ఇక్కడ తేమ శాతం 17 వస్తే మిల్లరు మాత్రం 28 వస్తుందని లారీ అన్‌లోడ్ చేయలేదని నిర్వాహకులు చెప్పడంతో వారితో మాట్లాడతానని డీఆర్‌డీఓ వివరించారు. ఏపీఓ హరిశ్చంద్రుడు, ఏపీఎం బాలకృష్ణ ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి కలీంలు ఉన్నారు.